# మీ ఆలోచన నెగ్గేది కాదు

శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మగారు

౧

విద్యార్థికాలమునుండియు నారాయణరావునకు నాట్యకళయం దభిరుచి మెండు. అప్పటి కప్పుడే అతడు తమకళాశాల వార్షికోత్సవములలోను, తదితర-ఉత్సవముల సందర్భములలోను ఉత్తమపాత్రముల నభినయించి ప్రేక్షకలోకమును రంజింపచేయుచుండెడివాడు. క్రమముగా నాతడు యం. ఏ. పరీక్షయం దుత్తీర్ణుడై రాజమండ్రి కాలేజీలో ప్రొఫెసరుగా జేరినాడు. దాదాపు ఇరువదేండ్లనుండి యాతడీ లౌకికవృత్తియందు కాలము గడుపుచున్నను, తన యభిమానవిద్యయైన నాట్యకళను విడనాడలేదు. నాయకపాత్రధారణమునం దాత డిప్పటికిని అసదృశుడే. ఆయాసందర్భములయందు మానవునియందు సహజముగా నుత్పన్నము గావలసిన యవసరము లాతని చెప్పుచేతలలోనివి. వివిధభావము లొక్కనిముసములో నాతడు తన ముఖమునందు ప్రతిబింబింప జేయగలడు. దానికి తగినట్లుగా శరీరసౌష్ఠవమును, కంఠమాధుర్యమును నాతని కొప్పి యున్నవి. వడియు, నానుడును లేక సమానగతిలో గాంభీర్యమును, మార్దవమును వెదజల్లు నాతని వాచికము శ్రోతల కపూర్వానందమును గూర్చుచుండును. ఇక నతడు నటకలోకనాయకమణి యనుటలో నాశ్చర్య మేమున్నది? కావుననే యావదాంధ్రలోక మాతనికి ‘కళాసార్వభౌము’ డనుబిరుద మొసంగినది. అది అతనికి తగిన బిరుదే కదా.

౨

నట్టువ జీవితమునందు నారాయణరావునకు దాదాపు ఇరువదైదేండ్లు గడచినవి. ఇంతకాలమునుండియు నాతడనేక నాటకములందు నాయకపాత్రను ధరించి ప్రేక్షకుల రంజింపజేసి యున్నాడు. ఈ పాతికేండ్లనుండియు ఆతని నాయికె పురుషుడుగానే ఉండెను. అయినను అతని అభినయశ్రీ కెప్పుడును లోటు గలుగలేదు. స్త్రీపాత్రము నభినయించుటయందు నిపుణులగు నొకరిద్దఱిని తోడుచేసికొని వారు నాయికవేషమును వేసిననే ఆతడు నాయకవేషమును ధరించువాడు. కాన పురుషనాయికయం దాత డెప్పుడును అసంతృప్తుడు కూడ కాలేదు. అయితే కాల మెప్పు డొకేతీరున నుండదు. తలంపు లెల్లప్పు డచంచలములై యుండవు. ఇటీవల కొంతకాలమునుండియు స్త్రీలే స్త్రీపాత్రను ధరించిన బాగుగా నుండునను తలం పాతని చిత్తమునం దుదయించినది. కలిగినదే తడవుగ "ఇంతింతై వటుడింతయై మఱియు దా నింతై నభోవీథిపై నంతై" అన్నట్టుగా విజృంభించినది. ఇది పాశ్చాత్యనాగరికతాసంసర్గవిశేషమో, ప్రాచీననాట్యశాస్త్రపరిశీలనఫలితమో, చిరకాలానుభవసారమో — ఏమియైన నేమి? నారాయణరావు హృదయమునం దద్భుతపరివర్తనహేతువైనది. స్త్రీలను నాటకరంగమున కెక్కించి తీరవలయునని దృఢనిశ్చయము చేసికొనినాడు. కాని, "ఆ స్త్రీలు కులటావృత్తిచే కళంకితలైన వారవనితలుగా నుండరాదు. అట్టివారివలన పవిత్రమైన నాటకకళ కపయశము వాటిల్లును. కాన వారు కులాంగనలై యుండవలయు" నని యాత డనుకొనినాడు. ఈవిధముగా దృఢనిశ్చయమును చేసికొనినవెనుక తొలుత తన మిత్రులకడ నీ విషయము ప్రస్తావించినాడు. "ఛీ,ఛీ ఎబ్బెబ్బే! మనము పాడవుచున్నది గాక ఆడవాండ్లనుగూడనా? కూడదు. కూడదు" అని వా రాక్షేపించినారు. తరువాత భార్యయైన రాజేశ్వరితో ప్రస్తావించినాడు. "సరే లెండి, మీ ఆలోచన. రంగు పూసుకొని రంగాని కెక్కి పరాయి మగవాడితో ఆడటానికి ఏఆడది సాహసిస్తుంది? ఒకవేళ ఎవతైనా సాహసించినా దానిపరువు దక్కదు. కాబట్టి మీ ఆలోచన నెగ్గేది కాదు" అన్నది రాజేశ్వరి. నారాయణరావు మనస్సు కలక్కుమన్నది. కొంచెమునేపు నిస్తబ్ధుడై యుండి, "అయితే యెవరూ రారా? నా ప్రయ

త్నము వ్యర్థమేనా?" అనుకొనినాడు. కాని పూర్తిగా హతాశుడు కాలేదు. "నా భార్య అమాయికురాలు. నాగరికస్త్రీప్రపంచములో జరుగుచున్న మార్పులామెకు తెలియవు. అందువలననే ప్రతికూలముగా నుడివినది. కళాభిమానినులును స్త్రీ స్వాతంత్ర్యవాదినులు నగు యువతీమణులచే నా యభీష్ట మీడేరక పోదు" అను తలంపు ఆతని మనంబును మరల ఆశాపూరితము గావించినది. కాన వెంటనే స్త్రీల నాటకరంగ ప్రవేశమునుగూర్చి యొక దీర్ఘ వ్యాసమును పత్రికలలో ప్రకటించినాడు. ఆ మహావ్యాసమును చూచి పురుషులే చకితులైనారు. సామాన్యకుటుంబినులడలిపోయినారు. మతసాంఘిక రాజకీయములందు స్త్రీలకు స్వాతంత్ర్యము నాశించెడు యువతీమణులకుగూడ నోడలు జల్లుమన్నది. ఇక నా విషయమును బుద్ధిపూర్వకముగా నామోదించినవారొకరో, యిద్దరో! మొత్తముమీద నారాయణరావు తలంచినభంగి స్త్రీపురుషులలో నెవరినుండియు చేయూత రాలేదు. మఱియు నొకటిరెండు ప్రతికూలవ్యాసములు గూడ పత్రికలలో పడినవి. ఉద్యమమునకు ప్రతికూలత యెక్కువైన కొలది నారాయణరావునకు పట్టుదల యెక్కువైనది. ఎటులైన నీయుద్యమమును సాగించితీరవలె ననుకున్నాడు. పరస్త్రీలతోడ్పాటు లేకున్నచో స్వకుటుంబస్త్రీలతోనైన నీసంస్కారము నారంభింపవలెనని కృతనిశ్చయుడైనాడు. కాని యెట్లు? రాజేశ్వరి యేడుగురుబిడ్డలతల్లి. ముప్పదైదేండ్లకు పైగా నున్నవి. వారి పెద్ద కొమార్తెయగు రుక్మిణి యిద్దఱు బిడ్డలతల్లియగుటచే రాజేశ్వరి అమ్మమ్మయు, నారాయణరావు తాతయునై చాలకాలమైనది. ఆమె నిప్పుడు రంగమున కెక్కించుట హాస్యాస్పదము. మఱియు ఆమె పెనిమిటి రాత్రింబవళ్లదేపనిగా నాటకభాగములను వల్లించుచు, పద్యముల బాడుచు, అభినయము సాధించుచు కళావ్యాసంగమున దగిలియున్నను, వానిలో నొక్క విషయమునైనను మనస్సున బట్టించుకొన్నపాపమున బోలేదు. అట్టియామెను బలవంతముగా రంగస్థలమున కీడ్చుకొనిపోయినను ప్రయోజన మేమి? ఈకారణములచే భార్యావిషయమై ఆశ వదులుకొనవలసివచ్చినది నారాయణరావునకు. ఇక కొమార్తెలు ముగ్గురున్నారు. కాని వారు ముగ్గురు పెండ్లయినవారే. తన కిష్టమని తీసికొని వెళ్లి కొమార్తెలచే నాటకా లాడించినచో వారి అత్తవారేమందురో. అదియు అననుకూలముగానే యున్నది. ఈవిధముగా స్త్రీల నాటకరంగప్రవేశోద్యమమును తలపెట్టినది మొదలు నారాయణరావు అస్థిరచిత్తుడై యుదయాస్తమయము లెఱుంగక యోచనానిమగ్నుడై యుండెను. ఎంత యోచించినను నారాయణరావునకు తనకుటుంబస్త్రీలలో తనతో గలిసి నాటకము లాడగలవారు గాన్పింపలేదు. లేదని తనయుద్యమమును విరమించుకొనుటకుగూడ నాతనికి బుద్ధి పుట్టలేదు. కాన నీభార్యవలన గాకున్న పునర్భార్యాస్వీకారమువలననైనను నీయుద్యమమును వ్యాప్తిపఱచి తీరవలయు ననుకొనినాడు. ఈసంకల్పము గల్గినవెంటనే రాజేశ్వరివద్దకు బోయి, "స్త్రీలచే స్త్రీపాత్రముల నభినయింపజేసి నాయభిమానకళయైన నాటకకళ నౌన్నత్యదశకు తీసికొనిరావలయునని నాయభిప్రాయముగా నున్నది. ఇందులకు నీకు సామర్థ్యము లేదు. నాయింటివారినెవరిని ముందు నాటకరంగమునకు దోడ్కొనిపోక పరస్త్రీలను రమ్మనుటయు నాకుచితముగా నుండలేదు. కాన కళాప్రియయగు నొకస్త్రీని పెండ్లాడుటకు నిశ్చయించుకొంటిని. నీయభిప్రాయ మేమి?" అన్నాడు నారాయణరావు. పెనిమిటి మాటలను విని రాజేశ్వరి కొంచెముసేపు నివ్వెఱపోయినది. "రాగారాగా ఆయనకళాభిమాన మిట్టి వెఱ్ఱిదారులకు బోవుచున్న దేమి? దీనిపర్యవసానమేమో!" అని చకితురాలైనది. కాని ఆతని ఉద్దేశ్యమును మాత్రము కాదనలేదు. నారాయణరావు పట్టుదలస్వభావము గలవాడని రాజేశ్వరికి బాగుగా తెలియును. కాన ఆతనిఅభిప్రాయము కాదని వాదించుట నిష్ప్రయోజనమని భావించి, "మీయిష్టమున కెప్పుడూ నాఅభ్యంతరము లేదు గాదా?" అన్నది రాజేశ్వరి. నారాయణరావు మహానందము నొందినాడు. తత్క్షణమే కలము, కాగితము తెచ్చి యీ క్రిందివిధముగా వ్రాసి ఆంధ్రపత్రికకు పంపినాడు,

"వధువు కావలయును

"విద్యాధికుడును, నాట్యకళా ప్రియుడునునగు నొక నటశిఖామణికి రూపవతియు, విద్యావతియు, నాటకములయం దాతనితో నభినయింపగల కళావతియు నగు వధువు కావలయును. వలయువారు వివరములకు వ్రాయుడు.

"కళాభిమాని
"c/o ఆంధ్రపత్రిక.
"మద్రాసు."

## 3

"మన దేశము వేఱు. మనభాష వేఱు. మన కట్టుబొట్టులతీరు వేఱు. మనసంప్రదాయమే వేఱు. అట్టిచో ఆంధ్రస్త్రీలు నాట్యకళయందు గూడ ప్రవేశించి తమ వ్యక్తిత్వమును నిలువబెట్టుకో నక్కఱ లేదా? ఆంధ్ర నాటకరంగములలో పురుషులు స్త్రీపాత్ర నభినయించుటకంటెను, ఆంధ్రసినీమా కంపెనీలలో కొద్ది పైట, నడిమిగోచీ, అర్ధచంద్రతిలకము గల మహారాష్ట్రస్త్రీ లభినయించిన బొంబాయిఫిలుములును, తలపై ముసుగు, ఒడలినిండ ముసుగు గల ఉత్తరహిందూస్థానపుస్త్రీ లభినయించిన కలకత్తాఫిలుములును ప్రదర్శింపబడుట కంటెను ఆంధ్రస్త్రీల కవమానము వేఱొకటి గలదా? ఏమైన సరియే, ఈవిషయమున ఆంధ్రస్త్రీలకు మార్గదర్శకురాలను కావలయును. ఈనాఅభిప్రాయము నామోదింపగల కళాకోవిదుడు దొరకిననే నేను పెండ్లాడుదును. లేకున్న లేదు" అని మాలతి దీక్షపట్టి కూర్చున్నది. బుద్ధి తెలిసిన పిల్లకు ఆమె ఆశయముల కనుకూలుడగు భర్తను విచారించుటే న్యాయ్య మని వేంకటరత్నముపంతులు గారు పెండ్లివిషయమై కొమార్తెను ఒత్తిడి చేయలేదు. నేడు ఆంధ్రపత్రికలో ప్రకటింపబడిన 'కళాభిమాని' ప్రకటనను గని తండ్రిబిడ్డల మొగము సంతోషముతో వికసించినది. 'ఇతడు నా కనుకూలుడగు వరుడు కావచ్చును' అని మాలతి తండ్రితో రూఢిగా పలికినది. 'అవును; ఉత్తరము వ్రాసి వివరములు తెలిసికొందాము' అని వేంకటరత్నముగారు ఆలోచిస్తూ అన్నారు. ఈ విధముగా తండ్రి తనయుల కిరువురకు యోచనాపూర్వక మగు సంభాషణ జరిగినవెనుక ఉత్తరము వ్రాయబడినది.

మాలతి వేంకటరత్నముగారి యేకైకపుత్రిక. ఆమెకు చిన్నతనముననే తల్లి పోయినది. కాన తండ్రివద్ద చనువు మెండు. వేరే దగ్గరకు దీసి మంచిచెడ్డలు దెల్పే స్త్రీ లెవ్వరు లేకపోవుటచేత ఏసంగతినైనను తండ్రితోనే చెప్పుట, ఆయన అవును కా దనుట, మాలతికి అలవాటైపోయినది. సంఘసంస్కారియు స్త్రీవిద్యాభిమానియు నైన వేంకటరత్నముగారు మాలతికి బాల్యవివాహము చేయక ఉన్నతవిద్య చెప్పించిరి. మాలతి స్కూలుఫైనలు ప్యాసై ఒక్కసంవత్సరమైనది. ఆవల కొన్నియిబ్బందులవల్ల ఎఫ్. ఏ. చదువుటకు వీలు కాలేదు. కాబట్టి చదువు మాని విశ్రాంతిగా నున్న మాలతి యిప్పుడు కళావిషయకములగు గ్రంథపత్రికాదులను చదువుట, మంచిఅభినయకోవిదులచే ప్రదర్శింపబడు నాటకములను, సినీమాలను చూచుట,—ఇదియే పనిగా బెట్టుకొన్నది. అనుభవ మెక్కువైనకొలది తాను అభినయించవలయు నను కుతూహలముగూడ బలపడుచున్నది మాలతికి. అయితే యీసంస్కారముకొఱకు తాను స్వాతంత్ర్యము గల కన్యకగా నుండవలయునా? లేక గృహిణిగా నుండవలయునా? అను యోచన మాలతి చిత్తములో రేగినది. తనకళాభిరుచికి దోహద మీయ గల వరుడు దొరకినచో పెండ్లి చేసికొనవలయుననియే మాలతి నిశ్చయించినది. కాన ఆంధ్రపత్రికలోని ప్రకటన మాలతికి సంతోషము గలిగించినది.

## ౪

నాల్గుదినములలో ఆంధ్రపత్రికాకార్యాలయము నుండి తగువివరములతో ప్రత్యుత్తరము వచ్చినది. వరుడు 'కళాసార్వభౌము'డని బిరుదందిన నారాయణరావని తెలిసినతరువాత ఆతని కళాప్రావీణ్యమును పెక్కుమారులు చూచి సంతోషించిన మాలతికి మిక్కిలి సంతోషమైనది. కాని అనుభవజ్ఞుడగు తండ్రికడ తనసంతృప్తికి దగిన యామోదము మాలతి కాంచజాలకపోయినది. 'నాన్నా! నాఅభిరుచికి దగినట్లుగా ఈవరుడు ప్రఖ్యాతిజెందిన

కళాసార్వభౌముడనుట చాల సంతోషకరమగు విషయము' అన్నది మాలతి తండ్రితో.

మాలతియొక్క అమాయికానందము వెంకటరత్నముగారికి జాలివేసినది. ఆయనను పీడించుచున్న పెక్కుసంశయము లొక్కుమ్మడిగా మనస్సును కలతపెట్టినవి. కాన శంకాకులితమైన స్వాంతముతో, 'అమ్మాయీ! ఆయనవయస్సు నలువదినాలుగేండ్లు' అన్నారు.

'అవును' అన్నది మాలతి.

'ఇరువురిమధ్యను ఇరువదినాలుగేండ్లు తేడా.'

'నిజమే కాని, ఆయన అంత వయోవంతుడుగా కన్పడడు.'

'ఆయనకు భార్య ఉన్నది.'

'నాకు తెలుసు.'

'ఏడుగురు బిడ్డలతండ్రి.'

'విన్నాను.'

'పెద్దవాడు, మఱియు పెండ్లాముబిడ్డలు గలవాడు.'

'అవును గాని, తనవివాహమునకు భార్య అంగీకరించినదని ఆయన వ్రాసినారుగదా.'

మాలతి యవివేకమునకు వెంకటరత్నముగారు పెద్ద నిట్టూర్పు విడిచిరి. కళాభిరుచి మాలతిని గ్రుడ్డిదానినిగా జేయుచున్నదని చింతించిరి. కాని యుక్తవయస్కురాలగు మాలతికి తా నింతకంటె చెప్పవలసినపని లేదని ఆయనకు తోచినది. కాన వేంకటరత్నముగారు మఱి మాటాడలేదు.

కొలదిదినములలోనే మాలతీనారాయణరావు లొకరి నొకరు చూచుకొనుటయు, సమ్మతిపడుటయు నైనది. అనంతర మొకశుభదినమున సుప్రసిద్ధమైన విజయవాడకళామందిరమున కళోద్ధారకుల ఆదరణమున కళాప్రియులగు మాలతీనారాయణరావులు దంపతులుగా జేయబడినారు. మాలతికి అయిదాఱురకముల బంగారుగాజులు, చంద్రహారము మునుపే యున్నవి. రవ్వలకమ్మలు, బేసరి పెండ్లిబహుమతిగా మాలతి తండ్రికడ బడసినది. పెండ్లికొమారుడైన నారాయణరావు వధువు కిచ్చిన నగ నీలమణిటుంగర మొక్కటే. ఆ ఒక్కటి వేయి రూపాయలు.

※

అవి వేసవిసెలవులు. కనుక నవవధువును దోడ్కొని నారాయణరావు బెంగుళూరు వెళ్లినాడు. అచ్చట వారుండుటకుమాత్రమే యేబదిరూపాయలబాడుగగల చిన్న బంగళా. ఆహారపానీయము లన్నియు హోటలునుండియే రాక. ఇక వారి కేజంజాటము లేదు. నారాయణరావు సంగీతసారస్వతమున కూలంకషప్రజ్ఞానిధి. మాలతి వీణెపాటయందు నేర్పరి. నారాయణరావు కళోపాసకుడు. మాలతి దానికే జీవితము సమర్పింపదలచుకొనిన కళావతి. నారాయణరావు సారస్వతప్రియుడు. మాలతి దానిని సాధింపదలచిన విదుషి. నారాయణరావు రసాత్మ గలవాడు. అగుటచే కట్టులో, బొట్టులో, జుట్టులో శృంగారమునే లక్ష్యముగా గొనును. మాలతియు నావిషయమున నాతనికి తీసిపోదు. కాన ఒకరిభావము లొకరికి నచ్చినవి. ఒకరి అలంకారము లొకరికి ప్రియము గూర్చినవి. ఒకరినడవడి యొకరికి ఆమోదకరమైనది. ఆసమయమున రసికజనమనోభిరామములగు ఆరామములకును, ఆలోకరమణీయములగు ప్రదర్శనములకును, చక్కని సుఖశీతోష్ణతకును ఆకరమైన బెంగుళూరునగరమున వారు వసించుట మఱింత ఉల్లాసకరముగా నున్నది. వా రానగరమున జరిగెడి నాటకములు, పాటకచ్చేరీలు, సినీమాలు చూచుటయే గాక, మైసూరురాష్ట్రమునగల సృష్టివిశేషములు, ప్రాచీనశిల్పములు మున్నగునవిగూడచూచి వచ్చుచుండిరి. ఇన్ని మనోహరకాలక్షేపములతో ప్రొద్దులు పుచ్చుచున్నను మాలతి తనఅభిమానకళయైన అభినయమునుగూడ విడనాడలేదు. సీతపాత్ర నభినయించుటను నారాయణరావుకడ నభ్యసించుచున్నది.

※

మాలతీనారాయణరావుల వివాహవృత్తాంతము పత్రికలలో చూచి నాట్యకళాప్రియులు సంతోషముతో

పొంగిపోయినారు. 'మీవివాహము నాట్యకళ కమూల్య లాభమును చేకూర్చుగాక! మీవంటి కళాదంపతులచే నాంధ్రనాటకరంగము జగన్నుతకీర్తిని గాంచును గాక' అని పెక్కుమంది బంధుమిత్రులు నారాయణరావును అభినందించుచు జాబులు వ్రాసినారు. మిక్కిలి చనవుగల మిత్రులు కొందఱు 'వేసవి సెలవులు ముగియులో మీసతీపతులు నాయికానాయకులుగా గల ఒక మనోహర నాటకమును ప్రదర్శింప ఆంధ్రలోక మెదురు చూచుచున్నది' అని హెచ్చరిక లేఖలు వ్రాసినారు. ఇట్టి ప్రోత్సాహకరమైన లేఖలు చూచుకొని, 'నాయత్న మాంధ్రమహాజనుల యాదరము బడయుచున్నది. ఇకను నేను సంకల్పసిద్ధుడ నైనట్లే' యని నారాయణరావు లోలోన పొంగిపోయినాడు.

మఱియు వారు కోరినట్టుగా వేసవి సెలవులు తీరు లోపల మాలతిని నాయికగా జేసికొని యొక ప్రదర్శనము జరుపుటగూడ నుత్తమకార్యమని భావించినాడు గాన మాలతితో నాలోచించి, "జూలై నెల మొదటివారములో బెజవాడకళామందిరములో 'సీతారామ' అను నాటకమును ప్రదర్శించెదము. అందు మాలతీదేవి సీత పాత్ర నభినయించును; నేను రామభూమికను ధరింతును. ప్రదర్శనమున కనుకూలమగు నేర్పాటులు చేయవలసిన" దని బెజవాడమిత్రులకు ఉత్తరము వ్రాసినాడు నారాయణరావు.

నారాయణరావు వ్రాసిన జాబు చూచుకొని మిత్రులు పొంగిపోయినారు. వెంటనే ఈవిషయమును పత్రికలలో ప్రకటించి అచట కావలసిన యేర్పాటులు చేయుచున్నారు.

ఈవృత్తాంతమును పత్రికలలో చదివిన ఆంధ్ర మహాజను లనేకులు జూలై మొదటివారములో బెజవాడకు ప్రయాణము పెట్టుకొనినారు. ప్రదర్శనము వారము దినము లున్నదనగానే టిక్కెట్లఅమ్మకము ప్రారంభమైనది. దినదినము వందలకొలది టిక్కెట్లు అమ్ముడు పోవుచున్నవి. నాటకఖేలనదినము సమీపించినకొలది ఇతరనగరములవారు సీట్లు రిజర్వుచేయించుకొనుటకై టెలిగ్రామ్మనియార్డరులు సైతము పంపడ మారంభించినారు. పొరుగూరివారి సంరంభమే యిట్లుండ స్థానికుల సంగతి చెప్పవలసిన దేమి? టిక్కెట్టు కొననివాడు వెలి. స్థలాభావముచే ప్రదర్శనము రెండుదినము లున్నదనగనే టిక్కెట్లు అమ్మక మాగిపోయినది.

## ౬

సరిగా నాటకము ప్రదర్శించెడుదినమునకు మాలతీనారాయణరావులు బెంగుళూరునుండి దిగినారు. మిత్రులు వారిని రైలుస్టేషనువద్ద నెదుర్కొని పూలదండలచే బహూకరించినారు. ప్రదర్శనకుతూహలురై వచ్చిన ప్రేక్షకజనులతో విజయపురి కలకలలాడిపోయినది. దుర్గావిలాసములో విడిసిన కళాదంపతులకు మిత్రులతోడి సల్లాపముతో పగలు గడచిపోయినది.

రాత్రి తొమ్మిదిన్నరగంటలకు నాటక మారంభమైనది. 'సీతారామ' అనునది రామాయణగాథ నంతయు సంగ్రహించి వ్రాయబడిన నాటకము. బాలరాముని పాత్ర నెవడో బాలు డభినయించి వెడలిపోయినాడు. శివధనుర్భంగమువఱకు కథ ఆబాలునితోనే నడచిపోయినది. తనపడుచుభార్యపజ్జ నితరులను పతిగా నిలువబెట్టుటకు ఇష్టము లేదో యేమో గాని, కల్యాణసమయము నుండి రామభూమికను కళాసార్వభౌముడే చేకొనినాడు. సుప్రసిద్ధుడగు నాతనిని ప్రేక్షకులు తనివోనిచూడ్కులతో జూచుచున్నారు. ఇంతలో విద్యుల్లతవలె మాలతి రంగస్థలమున పొడసూపినది. సుకుమారసుందరతనూవల్లికి నీలకౌశేయ మొక యపూర్వశోభను గూర్చుచున్నది. సహజలావణ్యమునకు మణిమయాభరణములు వన్నెబెట్టుచున్నవి. శిరోర్ధమును గప్పిన వలిపెంపు మేల్ముసుంగు వింతయందమును గలిగించుచున్నది. సుప్రసన్నాననమున కన్యకాసహజమైన నునుసిగ్గు లేనగవులు తాండవించుచున్నవి. శాంతశృంగారశ్రీ శాభావప్రబోధకంబులగు క్షణములు ప్రేక్షకలోకంబు నరిగట్టుచున్నవి.

వయసునకు దగిన సౌందర్యము. సౌందర్యమునకు దగిన అలంకారములు. అలంకారములకు దగిన వస్త్రవిన్యాసము—అహో! జగన్మోహినివలె నున్న మాలతికి

ప్రేక్షకులు కన్నులప్పగించినారు. 'ఆహా! ఏమి సౌందర్యము! ఏమిసౌందర్యము! ఛీఛీ, మగవాని ఆడువేషము చూచి చూచి కన్నులు కాయలుగాచినవి. ఎన్నాళ్లు మగవాడు సాధనచేసిన నేమి? ఈవాల్గంటి నయనవిక్షేపములో లవ మాత్రమైన సాధింపగల్గెనా? తుట్టతుద కొక్క పైట సవరించుకొనుటైన, ఒక్కపక్క కొత్తిగిలుటైన నేర్చుకొనెనా? ఎబ్బె! ఏది అభినయించినను ఎరవుదెచ్చుకొనినట్లే కదా!' అని మగమగువల వర్తనమును నిందించుచు అనిమిషనయనములతో అవలోకించుచున్నారు. మాలతి కెదురుగా నిలువబడియున్న నారాయణరావు జగన్మోహిని వలెనున్న మాలతిని చూచినాడు. అనిమిషనయనములతో నాలోకించుచున్న ప్రేక్షకులను చూచినాడు. ఆతని చిత్త మేలనో చేయిపెట్టి కలచినట్లైనది. ఒడలున చిఱుచెమటలు క్రమ్మినవి. మోము వెలవెల్లనైనది. "ఆట మీద లక్ష్యం లేదు! వెధవలకు ఆడదానిమీదనే. ఆవిడను చూచే దేమిటి, నన్ను చూడరాదూ" అనుకొనినా డప్పుడు నారాయణరావు. స్త్రీ యొక్క సౌందర్యమును కన్నార గాంచెడి హక్కు ఒక్క పెనిమిటికే కలదు. తదితరుల కామె పరస్త్రీ. ఆమె తల్లి యగుగాక, సోదరి యగుగాక, బిడ్డయగుగాక, ఆమె పరస్త్రీయే. వయోవంతుడగు పురుషుడు భార్య గాని మఱే యేస్త్రీయందైన తన పరామర్శకమైన దృష్టిని బఱపరాదు. ఇది సనాతనార్యసంప్రదాయము. యోగ్యుడగు ప్రతిహైందవుడును సంప్రదాయసిద్ధమైన యీమర్యాదకు సహజముగానే అలవాటుపడిపోవును. తాను పరస్త్రీలయెడ నెట్టినమ్రతతో వర్తించునో, తనస్త్రీయెడగూడ నట్టిభావ మితరుడు చూపవలె ననుభావముగూడ హైందవహృదయములో జన్మతో పెరిగినదే. స్త్రీలను రంగస్థలముల కెక్కించవలయునని తలంచిననాడు, అందుకై తీవ్రకృషి సేయునాడు, అందుకొఱకే పునర్వివాహ మాడునాడు, దానికొఱకే మాలతిని సిద్ధపఱచునాడు తనలో నిట్టిభావము నిలిచియున్నదనియు, నది తన్ను కలతపెట్టునని యు నారాయణరా వెఱుగడేమో! నాట్యకళోద్ధరణోన్మాదములో నాత డీవిషయవిచారణకు మనంబున తావీయలేదు గాబోలు! ఆతనిహృదయకుహరమునం దెచటనో నక్కియున్న యీభావ మిపు డాతనిపై విజృంభించినది. దాని కాతడు లొంగిపోయినాడు. ప్రేక్షకుల అవలోకనము లాతనికన్నులలో వాడిసూదులు గ్రుచ్చుకొన్నట్టులైనవి. తనపడుచుభార్య నన్నివేలమంది పురుషులు హర్షముతో జూచుటాతనికి దుర్భరమనిపించినది. ఆమెను కన్నార చూచుటకు తనకుమాత్రమే గల న్యాయ్యమైనహక్కును ఇతరులు దురుద్దేశముతో ఆక్రమించుకొనుచున్నారు అనుకొనినాడు. కాని తానీవిధముగా తనహక్కును ఇతరులకు పంచిపెట్టుటకే పెండ్లాడితి ననువిషయ మాతని కాసమయమున స్ఫురించలేదు. ఇట్టిభావకల్లోలముచే బీభత్సహృదయుడై కళాసార్వభౌము డల్లాడుటచే జగన్మాన్యమైన యాతనియభినయసామర్థ్యముగూడ నాడు భగ్నమైనది.

పాపము! మాలతి యాబీభత్స మేమియు నెఱుగదు. తాను నేర్చినంతవట్టు, తనకు సామర్థ్యము కలయంతవట్టు నెమ్మదిగా, చక్కగా, సమయానుకూలముగా నభినయించుచున్నది. త్రేతాయుగపు సీతను నేడు కన్నార గాంచగల్గితిమని ప్రేక్షకు లానందించునంతటి యొప్పిదముగా నున్నది మాలతి యభినయము. కాని నారాయణరావున కామెయభినయకౌశల మేమాత్రము ఇంపును గూర్చుటలేదు. 'ప్రేక్షకులు ఎగబడి చూచినకొలది మఱింత కులికిపోవుచున్న'దని ఆతని కామెపై, ఆమె ఆ అభినయముపైనను గూడ అసూయ జనించినది. ఇట్టియీాసుతో గొట్టుకాడుచున్న ఆతనికి అకల్మషచిత్తయగు మాలతితో సమానముగా నభినయించుట కెట్లు సాధ్యమగును? కాన నా డతనినటనము ప్రేక్షకులకు మిక్కిలి అసంతృప్తిని గొల్పినది. ఒకప్పు డాంధ్రమహాజను లందఱ నానందవారాశి నోలలాడించిన యాతని కళాకౌశల మానాడు అసహ్యహేతువైపోయినది. ఒక్కఅభినయలోపమే గాక మఱియొక గొప్పలోపము గూడ నాడు నాటకముయొక్క ఓటునకు కారణమైనది.

నారాయణరావు కాయపాటువాడు. తటాలున చూచిన నాతని కున్నవయస్సునకు పదేండ్లు తక్కువ

వాడుగానే కన్పడును. అయిన నేమి? ఆతనివయస్సు వారిలో నాతడు దృఢగాత్రుడుగా కాన్పించవచ్చును గాని యిరువదేండ్ల జవరాలికి తగిన పెనిమిటి యనిపించుకొనుటకు సాధ్యమగునా? ఇరువదినాలుగేండ్ల వ్యత్యాసమును కప్పివుచ్చుట సామాన్యకార్యమా? చెక్కిళుల బిగు వించుక సడలించియు, విశాలలోచనము లించుక కుంచించియు, వినీలశిరోజముల నించుక పలిత మొనర్చియు, తనకు వశుడు గాక యింకను యువకుడుగానే యుండుటకు పోరాడెడి నారాయణరావుముఖముపై కాలపురుషుడు వార్ధక్యచిహ్నములను ముద్రించక విడువలేదు. అంటియు నంటకుండ నున్న ఆముద్రల నెటులైన తుడిచివేయవలయునని నారాయణరావు విశ్వప్రయత్నము చేయుచున్నాడు. ఒక్కడే కాన్పించినప్పు డాతనియత్నము సఫలమైనటులే కాన్పించెడిది. కాని ప్రాయపుయువతియగు మాలతిపజ్జ నారాయణరావు మోముపై కాలపురుషుడు వేసిన వార్ధక్యపుముద్రలు స్పష్టముగా గోచరించినవి.

౨

ఎటులో ప్రథమాంకము గడచిపోయినది. రెండవ అంకము ఆరంభమున జడలు ధరియించి తపసులచందమున వనవాసము నేయ నేగెడు రామలక్ష్మణులు, సీత రంగస్థలమున గన్పట్టినారు. రాజోచితాలంకారములచే నించుక కప్పివేయబడియున్న నారాయణరావు పెద్దతనమిందు స్పష్టముగా కనుపించినది. 'ముసలిమగడు పడుచు పెండ్లాము' అనుభావము అందఱిమనసులో పడిపోయినది. నాటకమునకు వచ్చినవా రందఱు పెద్దమనుష్యులు కాదు గదా. అందఱికిని కల్గినతలంపు బయలుపెట్టకుండ నుండు నోర్పు ఉండదుగదా. నోరు కట్టిపెట్టినను ఆగని వదరుబోతుజాతి యొకటి మనుజులలో నుండుట యెల్ల రెఱిగినసంగతియేగదా. అట్టివా డొకడు 'ముసలిమగడు, పడుచుపెండ్లాము' అని ఒక్కకేక పెట్టినాడు. దాని నింకొక డందుకొన్నాడు. వానివెనుక నింకొకడు. నాటకశాల యంతయు ఒక్కనిముసములో గల్లంతైపోయినది. చాపమీద పుట్టిన యీఅంటువ్యాధి గుంటలలోని కుర్చీలకు ప్రాకినది. మగచేత్తలో బుట్టి ఆడచేత్తకుగూడా అల్లుకొన్నది. అందఱినోళ్లు ఆడుతున్నట్లే కనపడుచున్నవి. అందులో పెద్దమనుష్యు లెవరో పిన్నమనుష్యు లెవరో, అనుచున్నవా రెవ్వరో, అననివా రెవ్వరో తెలియదు. ఈసమయమున మాలతీనారాయణులచిత్త మెటు లున్నదో చెప్పవలసిన దేమి? వారు వికలులై, విహ్వలులై, ఒకరినిర్గమన మొకరెఱుగకుండ దుర్గావిలాసము చేరినారు.

౩

దుర్గావిలాసమునందు నారాయణరా వొకగదిలో, మాలతియొకగదిలో మేను వాల్చినారు. కాని యిద్దఱు నిద్ర నెఱుగరు. నారాయణరావు ఇరువదైదేండ్ల నుండి నాటకములలో పాల్గొనుచున్నాడు. ఎప్పుడును అభినందనములనే గాని అధిక్షేపణల నెఱుగడు. ఇంతకాలము నుండియు అజేయమై విరాజిల్లిన నైపుణ్యము నేడు పరిహాసపాత్రమై పోయినది. 'మీ ఆలోచన నెగ్గేది కాదు' అని రాజేశ్వరి పెట్టిన శాపము తగిలినది. "అయ్యో! ఎంత ప్రయత్నము చేసితిని! ఎన్నిమాటలు పడితిని! ఎంత సాహసమున కొడిగట్టితిని! వ్యతిరేకుల కెంతెంత గట్టి సమాధానము లిచ్చితిని! తుదకు నాకు శత్రువు నాలోనే యున్న దేమి? మాలతిచే రంగస్థలమున నభినయింపజేయవలయుననియే గదా వివాహమాడినయుద్దేశము? ఆమె రంగస్థలమునకు రాగానే నాలో నా కంత కంపరము పుట్టుకొనివచ్చిన దేమి?........ అయినను ఇందు నా లోటేమున్నది? ప్రేక్షకులు పెద్దమనుష్యులై, కథపై లక్ష్యముంచి పదిలముగా నున్నచో నా కంతబాధ లేకపోవునదేమో.........మాలతి సరసురాలు కాదు. ప్రజలదృష్టి తనపై తగిలినకొలది ఆమెకు గర్వము హెచ్చినది. ఆమె లోప మేమున్నది?.........ఆమె అట్లు అభినయించుటకే పెండ్లాడినది. అందులకు నేను ఒప్పుకొనినాను. ఇప్పుడు సర్వసాధారణమగు స్త్రీల నడవడులు, పత్నీధర్మములు ఆమెపై చొప్పించి శంకించుట మేలా?... రంగస్థలమున స్త్రీలతోడి నటనమే ప్రమాదకరము. ఈ యుద్యమమునందే యున్న దీలోపము...... పాపము!

మృదులహృదయయగు మాలతిచిత్త మీ యవమానముచే నెంత నొచ్చియున్నదో? ఒక్కమాటు దగ్గరకు వెళ్లి పలుకరించి యోదార్చి వత్తునా? సిగ్గుసిగ్గు. ఆమె మొగ మెట్లు చూతును? స్త్రీలు రంగస్థలము నలంకరించి నాట్యకళను మహోన్నతదశకు తేవలయునని పలికి ప్రయత్నించి ఆమె నీడ్చుకొని వచ్చి ఆమెను నగుబాటుపాలు చేసి నేనై— సిగ్గు ... సిగ్గు ... ఆమె మొగ మెట్లు చూతును?"— నారాయణరావు హృదయవేదన యిది.

మాలతి బహుకోమలహృదయ. యువతి. అమాయిక. లోకానుభవము లేదు. తల్లిచాటున పెరిగినది కాదు. స్త్రీలకు స్త్రీలే నేర్పవలసిన మర్యాదలు, వర్తనములు, నీతులు ఎఱుగదు. స్వచ్ఛమైన హృదయములో దైవికముగా పడిన నాట్యకళ నభివృద్ధికి తేవలయు ననెడి యిచ్ఛకు తన్ను బలిపెట్టుకొనినది. కన్యాత్వము చెఱచుకొనినది. కామితార్థమైన కళాపోషకత్వముమాత్రము నెఱవేఱలేదు. పైగా అవమానముల పాలైనది. ఇప్పట్టున ఆకోమలచిత్త మెట్లు దందహ్యమాన మైపోవుచున్నదో? "......ఇటువంటితుంటరులవలన మానవతులకు మాట వచ్చుననియే కాబోలు, పెద్దలు స్త్రీలకు రంగస్థలము త్యాజ్యమనిరి. నాట్యకళను చేకొని యిదివఱకే యొక జాతి పతితమై పల్లటిల్లుచున్నది. అది వారి దుర్వర్తన ఫలితము గాని కళయొక్క లోపము గాదనుకొంటిని. కాని యాకళలోనే యిట్టిప్రమాదము గర్భితమై యున్నది కాబోలు. అయ్యో! యోచించలేదు.........అవును. మానాన్న అప్పుడే అన్నారు: '24 సంవత్సరము లేడా' అని అది. యేదో ప్రస్తావవశమైన మాట అనుకొన్నాను. ఈవ్యత్యాసమువలని లోప మాయన కప్పుడే గోచరించి యుండును. కావుననే మానాన్న నావివాహమువిషయమై యెక్కువఉత్సాహము చూపలేదు. పైగా భార్య యున్నదనియు, పిల్లలున్నారనియు ఎన్నియోవిధముల విరుగుడుమాటలు చెప్పినాడు. నేను తెలిసికోలేదు. నా మనస్సు నొచ్చుననియో, నేను తెలిసియే ఆమోదించుచున్నాననియో మానాన్న ఒత్తి చెప్పలేదు. అవును, ఆయన నాప్రియజనకుడు. నామనస్సు నొచ్చుట ఆయన చూడలేరు......అయ్యో! ఆపరమకిరాతుల కేమిజాలి? నెమలి కంట నీరు గారిన వేటగానికి కనికరమా? అబ్బో యెన్నిమార్లు అచినారు: ఎంతగోల! ఎంతబీభత్సము! .........అబ్బా! తలచిన ఒడలు జల్లుమనుచున్నది. అవమానము.......అవమానము.......శరీరవ్రణమునకు మందున్నది. కాని హృదయవ్రణమునకు మందు లేదు. లేదు, లేదు. నావివాహముయొక్కయుద్దేశ మిట్లు తేలినది. నాకళాభిరుచి యీవిధముగా పరిణమించినది. నే నిప్పు డేమి చేయవలయును? ఈముదుసలిమగనితో సవతికడ నొదిగిల్లుపడుచు రాజమండ్రిలో కాపురమా, నాన్నగారియింటికి ప్రయాణమా?.............ఆకళాసార్వభౌముని అభినయ మంత అధ్వానముగ నున్న దేమి? ఎట్టి రసవంతమగు పట్టునందును రిచ్చవడినట్టు నిలువబడెనేమి? ఆతడు చాకచక్యముగా ప్రవర్తించి యుండిన నాటక మింతరసాభాసయ్యెడిది కాదేమో!......ఆతని చూపులలో నేదియో అసహ్యభావము కానుపించినదేమి? సకలసద్గుణరత్నాకరుడగు రామునిభూమికను ధరించిన నర్తకుడటులేనా యుండునది? సీతమ నగ్ని ప్రవేశము చేయించు సందర్భమున నట్టు లున్న బాగుండెడిదేమో. కాని అన్నిపట్టుల నదే రూపా?"

చెలమ యూరినట్టు లూరుచున్న యీ భావపరంపరలలో పడి మాలతి మఱిగిపోవుచున్నది. కన్నీళ్లు కాల్వలుగట్టుచున్నవి.

## ౬

అప్పుడే తెలతెలవాఱుచున్నది. ప్రొద్దుటిరైళ్లకు ప్రయాణికులను గొనిపోవు మోటారుబండ్లు, జట్కాబండ్లు పెద్దపెద్ద ధ్వనులు సేయుచు దుర్గావిలాసము ప్రక్కనుండి పరుగులెత్తుచున్నవి. మాలతీనారాయణరావు లటులనే యొకరిమొగ మొకరు చూడ సిగ్గుపడి పడియున్నారు. ఎవరో మాలతి గదివద్దకు వచ్చి, 'అమ్మాయీ! మాలతీ!' అన్నారు. ఆకంఠస్వరము మాలతికి చిరపరిచితమైనదే. 'ఎప్పుడొచ్చారు నాన్నా!' అని శోకగద్గదితమైన స్వరముతో ప్రశ్నించుచు మాలతి చివాలున లేచి తండ్రినద్దకు వచ్చి తండ్రిని పట్టుకొని భోరు మన్నది. ప్రాణపదమైన మాలతి దుఃఖమును చూచి భరించలేక

తండ్రి కన్నులనుండి నీళ్లు దెచ్చుకొని తల నిమురుచు, "ఎందుకు తల్లీ, ఏడుపు! ఊరుకో ఊరుకో! అభము శుభము నెఱుగవు. అమాయికురాలవు. చెప్పినా తెలుసుకొన్నావు కావు. ఏమి చేయను? రాత్రినుండి నేనూ యీవిధంగానే దుఃఖపడుతున్నా. ఊరుకో, అమ్మా! ఊరుకో."

'నాన్నా! నేనుగూడ ఏలూరు వస్తా? తీసుకొని వెళ్లుతారా?'

'ఎందుకు తీసికొనివెళ్లను? నీభర్తను అడిగినావా?'

మాలతి నారాయణరావు పడకగదిలోనికి వెళ్లి, 'నేను మానాన్నగారితో ఏలూరు వెళ్లుచున్నాను' అనినది. నారాయణరావు ఆవు ననలేదు, కాదనలేదు. వినియు విననట్టు లూరకుండెను. 'కళాభివృద్ధి కేర్పడిన దాంపత్యము కళావిచ్ఛిత్తికి కారణ మైనప్పుడు విడిపోవుటే మేలుగా' అనుచు మాలతి గది విడిచినది.

నారాయణరావు పెద్దనిట్టూర్పు విడిచి, "'మీ ఆలోచన నెగ్గేది కాదు' అనిన రాజేశ్వరిమాటే నెగ్గినది. నేను విఫలయత్నుడ నైనాను" అనుకొన్నాడు.

---

# రాజమందిరము

అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు

## పురము – కోట

శ్రీఁ జెలఁగు రాజులున్ గవి - రాజులు గోపాలనానురక్తిఁ బొదలుటన్
రాజమహేంద్రవరంబు పు - రాజనప్రాభవంబు రమ్యతఁ దలఁతున్.

బురుజుల దిబ్బ లున్నవి ప్రభుస్థలచిహ్నము లౌచు గౌతమీ
పరిచయమున్ దొఱంగుటకు భావము లొప్పక కోటగుమ్మమున్
గుఱుతగు వాడుకన్ బ్రజలనోళ్లఁ బాయఁగలేవు రాజమం
దిరపురపూర్వవైభవము తీ రొకనాఁటికి మాయునట్టిదే?

రాజరాజనరేంద్రు రాజ్యపాలనముల తీరులనెల్లఁ గన్నారఁ గాంచి
వీరభద్రారెడ్డి విశ్వంభర భరించు పోలికఁ బ్రత్యక్షముగఁ గనుఁగొని
గొప్పలక్షణి విన్నకోటపెద్దన చేతిగంటమ్ము ద్రిప్పు సాక్షాత్కరించి
అట్టి నారాయణభట్టు భారతపరిశీలనములను వీక్షించియుండి
కృతులు కృతికర్తలుం గృతిపతులు భూమి - పాలు రెండఱు మాఱినఁ గాలగతుల
మాఱుపులు చెనకఁగలేని మహిమతోడ వఱలు గంగమ్మ రాజమందిరము మ్రోల.